# వచ్చే జన్మకయినా...

## కె. మాధవి

"సుందరీ! నీ కవితలు మన కాలేజి మ్యాగజైన్‌లో పడ్డాయి చూశావా?"

"ఏదీ?" తాపీగా అందుకుంది. అచ్చులో తన పేరు మొదటిసారి చూడగానే సంతోషంతో గుండె ఝల్లుమంది. పరిశీలనగా చూస్తే కనిపించేది కనీకనిపించని చిరునవ్వు.

"కంగ్రాట్స్! చాలా బాగా రాసావు. ఎంతో నిదానంగా వుండే నువ్వు ఇంత చక్కని కవితలు వ్రాయగలవనుకోలేదు. ఒక మాటడుగుతాను. నిజం చెప్తావా ఒట్టు వేసి" అదోలా చూస్తూ అడిగింది క్లాస్‌మేట్.

"అడుగు" నిర్లిప్తంగా అంది.

"అసలు 'నువ్వే' వ్రాశావా? మీ మామయ్యలో అత్తయ్యలో వ్రాస్తే నువ్వు పంపావా? మరేంలేదు. మ్యాగజైన్లో పడినవేవీ సొంతంగా వ్రాసినవి కాదట. అందుకని అడిగాను. అసలనుకుంటూనే ఉన్నాను. నువ్వేమిటి కవిత వ్రాయడమేమిటని. నిజంగా చెప్పు ఒట్టేసి" వ్యంగ్యంగా అడుగుతోంది.

దిమ్మెరపోయింది సుందరి. ఒక క్షణం ఆగి "నాకు వ్రాసి ఇచ్చే వాళ్ళెవరూ లేరు. నేనే వ్రాశాను" పేలవంగా నవ్వుతూ అనేసి అక్కడినుండి కదిలింది. "ఎందుకో నేనంటే వాళ్ళకింత చులకన?".

కాలేజీలో ఉండాలనిపించలేదు. మోకాలిమీద అరచేతి ఆసరాతో ఒక ప్రక్కగా ఒరిగి కుంటుతూ నడుస్తోంది [illegible]

** ** **

"స్వాగతమండీ! అపర సరోజినీ నాయుడుగారు. తమరి సౌందర్యానికి తోడు కవితలూ, కథలూ కూడా వెలగబెడుతున్నారన్న మాట. రెండేళ్ళుగా అదే కాలేజీలో చదువుతున్నా మేము ఏనాడైనా ఇలాటి వెధవ వేషాలేశామా?" గుమ్మంలో అడుగు పెట్టగానే వెంగబిగించి కోరగా చూస్తూ అడిగింది పెద్దక్క.

"ఎవరికి వ్రాయాలనిపిస్తే వాళ్ళు వ్రాస్తారు. అదేం చెయ్యకూడని పని కాదుగా అక్కా!" బెదురుగా చూస్తూ అంది సుందరి.

"అక్కాలేదు చెక్కాలేదు. నోర్మూసుకో. నీ బ్రతుక్కి మమ్మల్ని అక్కా అనడం కూడానా. అక్కడికీ తమరికి వ్రాయడంవచ్చు మాకు రాదు. ఇంకేం చేతులరిగేలా వ్రాసి గొప్ప రచయిత్రివయిపో" వ్యంగ్యంగా చేతులు త్రిప్పుతూ అంటోంది చిన్నక్క.

మాట్లాడకుండా తన రూమ్‌లోకి వెళ్ళి తలుపేసుకుని వెనక్కి తిరిగింది.

ఎదురుగా గోడమీద చిరునవ్వుతో అభయమిస్తూ వ్రేలాడుతున్నారు ముఖ్యులైన దేవతలందరూ. అప్పటివరకూ బిగబట్టిన కన్నీళ్ళు 'ఇహ మేమాగలేమంటూ' దూకేసాయి బుగ్గలమీదికి.

"దేముడూ నేనేం పాపం చేశాను? నీకే అపకారం చేశాను? నన్నెందుకు వీళ్ళందరితోటీ బాధ పెట్టిస్తావు? అందంగా ఉండననేగా అమ్మ నన్ను పట్టించుకోదు. అక్కలు అసహ్యించు కుంటారు. మరి అంత అందంగా బంగారుబొమ్మల్లా మెరిసిపోయే అమ్మ, అక్కయ్యల మధ్య నన్నెందుకింత అసహ్యంగా, అవిటిగా పుట్టించావు? పుట్టిస్తే పుట్టించావు... నా దుఃఖాన్ని పంచుకోకపోయినా కనీసం నా ఆనందాన్ని పంచుకునేందుకు నా కోసం ఒక్క మనసును సృష్టించడం మరచావేం స్వామీ" మౌనంగా [illegible] జారిపోయింది.

మెలకువ వచ్చేసరికి సాయంత్రం అరయింది. కడుపులో పేగులు చేసే అల్లరికి గుర్తొచ్చింది మధ్యాహ్నం అన్నం తినలేదని. తలుపులు తెరచి బయటికొచ్చింది. అమ్మ చిన్నక్కను బ్రతిమాలుతోంది.

"ఇంకొంచెం పెట్టించుకోవే. మధ్యాహ్నం అన్నం కూడా వడ్డించుకోలేదు"

"వద్దమ్మా! నేను తినలేను. ఇప్పటికే అలా అని ఒకసారి పెట్టావు. టిఫిన్" అంటూ చేయి కడిగేసుకుంది.

"ఏం పిల్లవే! ఒక్క గరిట పెట్టించుకోమంటే ఏడుస్తావు..." ఇంకా ఏదో అనబోతూ గుమ్మంలో నిలబడ్డ సుందరిని చూచి విరుచుకు పడింది.

"ఏం చూస్తున్నావే ఏబ్రాసి మొహమా. కాలేజీలో రాచకార్యాలు పూర్తయ్యాయిగా. ఏం కథ రాద్దామని నిలబడి చోద్యం చూస్తున్నావు? దరిద్రపు మొహం. పేరులోనే మరి సౌందర్యమంతా ఉట్టిపడేది" అనేసి వెళ్ళిపోయింది తల్లి రాజేశ్వరి.

ఈ రకమైన కారణం తెలీని తిట్లు అలవాటయిపోయినా ఇహ అన్నం తినాలనిపించ లేదు. కాళ్ళు చేతులు మొహం కడుక్కుని పుస్తకాలు ముందేసుకుంది. ఇంతలో "అక్కా! అమ్మ అర్జెంటుగా రమ్మంటోందంటూ" రవి వచ్చాడు. రాజేశ్వరితో చెప్పి బయలుదేరింది.

** ** **

గుమ్మంలోనే నిలుచుంది శాంతి ఆంటీ చేతిలో తన కాలేజి మ్యాగజైన్‌తో. "రా సుందరీ! మీ క్లాస్‌మేట్ రాణీ చూపించింది నీ కవిత. బాగా వ్రాశావు. ముద్దూ మాటమాత్రంగానైనా చెప్పలేదేం?" అంటూ స్వీట్ నోట్లో కుక్కింది. ఇంట్లో జరిగిన సన్మానానికి, ఆంటీ ఆదరణకీ పొత్తు కుదరక ఉవ్వెత్తున పొంగి వస్తోంది దుఃఖం. అది కనబడనీయకుండా పక్కకు తిరిగి "మంచినీళ్ళు ఇవ్వలేదు ఆంటీ" అంది.

"అయ్యో! ఆ సంగతే మరిచాను. తెస్తానుండు" అంటూ లోపలి కెళ్ళింది శాంతి. పుస్తకం ముఖానికడ్డుపెట్టుకుని కళ్ళు గట్టిగా మూసుకుని చీకటిని చూడడం సాధన చేయసాగింది. ఎదుట మనిషిదగ్గర బేలగా మారకుండా అలా సాధన చేయడం చిన్నప్పటినుండీ అలవరచుకుంది.

"ఇంకా తినడం అవలా! ఇవిగో మంచినీళ్ళు. బోర్నవిటా"

"నాకు పాలు ఇష్టం వుండవని తెలిసే ఇస్తావు. నువ్విస్తే త్రాగకుండా ఉండనని నీ భరోసా. నాకు తెలుసులే" చిరునవ్వు నవ్వింది సుందరి.

అలాగే చూస్తుండిపోయింది శాంతి. మనిషి అనాకారి [illegible] అయినా భగవంతుడు అందమైన చిరునవ్విచ్చాడు. ప్చ్... నూటికో కోటికో ఒకసారి తప్ప నవ్వే కనిపించదు. ఆ మొహంలో శాంతం తప్ప. ఒక్కోసారి ఎంత అందమైన వాళ్ళయినా, అందమైన మనసు లేకపోతే అంద వికారంగా కన్పిస్తారు కొందరు. సుందరిలా అనాకారులైనా మంచిమనసువల్ల అందంగా అనిపిస్తారు. అయితే ఈరకమైన అందం చూడడానికి అందరికీ రాదు సుమా..."

"ఏంటి ఆంటీ! ఆలోచనల్లో మునిగిపోయారు? నేను వెళ్తానిక. అమ్మ కోప్పడుతుంది లేట్ అయిందని" అప్పటివరకూ చదువుతున్న వీక్లీ టేబిల్‌పై వదిలి లేచింది.

"నాన్న ఊరినుండి ఎప్పుడొస్తారు?" సాగనంపుతూ అడిగింది శాంతి.

"ఒక వారం పట్టొచ్చు వచ్చేసరికి. ఒక విషయం అడుగుతా ఆంటీ. నాకీ పేరు పెట్టింది మీరేనట కదూ. మీకేం అపకారం చేశానాంటీ? నామీద కోపం లాంటిదేమైనా ఉంటే ఇంత ఘోరంగానా తీర్చుకునేది?"

అలాగే చూస్తూండిపోయింది శాంతి. మనిషి అనాకారి అయినా, భగవంతుడు అందమైన చిరునవ్వు ఇచ్చాడు. ప్చ్...... నూటికో కోటికో ఒకసారి తప్ప అందంగా నవ్వే కనిపించదు ఆ మొహంలో శాంతం తప్ప...



అనేసి తెల్లబోయిన శాంతిని చూసి నవ్వేస్తూ "ఊరికే అలా అన్నాను నవ్వుతూ. పట్టించుకోకు" అంటూ ఇంటిదారి పట్టింది.

** ** **

సుందరి వెళ్ళిన చాలాసేపటి వరకూ అవాక్కయ్యిగా విలబడి పోయింది శాంతి. "18 సంవత్సరాలుగా ఎన్నడూ అడగంది ఈ రోజెందుకలా అడిగింది? ఆ విషయం ఈ రోజెందుకు గుర్తొచ్చింది? తను నవ్వుతూనే అందిగానీ ఆ నవ్వే నా గుండెను చివుక్కు మనిపిస్తోంది. అసలా పేరెందుకు పెట్టాను? 18 ఏళ్ళ క్రితం జరిగింది గుర్తొచ్చింది శాంతికి.

సుందరి తండ్రికి చెల్లెలు శాంతి అంటే చెప్పలేనంత ప్రేమ. ఇక కొద్దిరోజుల్లో రాజేశ్వరి సుందరిని ప్రసవిస్తుందనగా అన్నా చెల్లెళ్ళు ఓరోజు చెస్ ఆడుతూ కూర్చున్నారు. ప్రతిసారీ ఓడిపోతోంది శాంతి. "తమరి బుర్రలో ఈరోజు చిక్కుడు గింజ నాటితే తెల్లారేసరికి పాదై కూర్చుంటుంది. అంత సారవంతమైన మట్టివుంది నీ తలలో. హాయిగా గవ్వకాయ లాడుకోక ఈ ఆట నీకెందుకు? వెళ్ళు వెళ్ళు" అన్నాడు అన్న వేళాకోళంగా.

ఉడికిపోయింది శాంతి. "అన్నయ్యా! ఇదే లాస్ట్‌గేమ్. నువ్వు గెలిచావా జన్మలో చెస్ ఆడను. నేను గెలిచా నా నీకు రేపు మూడో కూతురుపుడితే సుందరి అని పేరు పెట్టాలి. కొడుకు పుడితే 115 నవల్లు కొనిపెట్టాలి. మరి వాడికి పేరు వెదకాలిగా!" అంటూ పందెం పెట్టింది. మొత్తానికి ఆట శాంతే గెలిచింది.

"ఈసారి కూడా అన్న వదిన పెద్దపాపలు ఇద్దరిలా అందమైన పాపే పుట్టాలి. నాకిష్టమైన 'సుందరి' అన్న పేరే పెట్టాలి!" అనుకోసాగింది శాంతి.

కానీ అనుకొని విధంగా నల్లటి ఆకారంతో లవిటికాలుతో పుట్టిన ఆ పాపను చూడగానే రాజేశ్వరి కెవ్వుమంది. "ఇది నా పాపకాదు. నా పాపనెవరో మార్చేసి ఉంటారు" అంటూ ఏడుపు మొదలుపెట్టింది.

అందరిలోనూ అదే ఆశ. రాజేశ్వరి మాటే నిజమైతే బాగుండునని. కానీ ఆరోజు ఆమె తప్ప ప్రసవించిన తల్లులెవరూ లేరా హాస్పిటల్లో. ఉయ్యాలలో పాప మాత్రం అమాయకంగా చూస్తోంది ఈ క్రొత్త లోకంలో తనకెవరూ సంతోషంగా స్వాగతం చెప్పలేదేమిటాని కాబోలు.

"ఈ అనాకారి పిల్లకు పాలు కూడా ఇవ్వనని" మొండి పట్టు పట్టింది రాజేశ్వరి. శాంతి ఎంతో నచ్చచెప్పింది.

"అందంగా ఉంటేనే మనుషులా. మీరందరూ అందంగా ఉండే మాట వాస్తవమే గానీ ఈ పిల్ల అలాలేదని పాలివ్వనంటే ఎలా. పాప చనిపోతే పసిగుడ్డును హత్యచేసిన పాపం నీదే అవుతుంది" అంది చివరగా.

"ఛస్తే చావనీ. ఇలాటి వికారి బ్రతికి బట్టకట్టే కంటే ఇప్పుడే చావడం నయం" అనేసింది రాజేశ్వరి.

అప్పటినుండి ఆ పాప బాధ్యత తానే తీసుకుంది. తన పెళ్ళయ్యేవరకూను. తన కళ్ళకెందుకో ఆ పాప అన్నా వదిన అంటున్నంత వికారంగా ఎన్నడూ కనిపించలేదు. కాస్త వళ్ళు చేసిందేమో ముద్దుకు తనకిష్టమైన పేరు "సుందరీ" అంటూ పిలిచేది. ముందు అనుకున్నట్లుగా అన్న కూడా కనీసం అన్నప్రాసన, బారసాల కూడా చేయలేదు. పెద్దమ్మాయికి చేసినట్లు తను పిలిచే ఆ ముద్దుపేరే అసలు పేరయింది. తన పెళ్ళయ్యాక పాపను తన కూడా తీసుకెడతానన్నా ఆమె తండ్రి ఒప్పుకోలేదు. అందమో, చందమో మాతోటే ఉంటుందిలే కన్యాక తప్పదు కదా అని పంపలేదు. అప్పటికి సుందరి మూడేళ్ళది. అన్నయ్య బిజినెస్ పనిమీద ఊళ్ళు తిరుగుతుంటాడు. ఇంట్లో ఏం జరుగుతున్నదీ పట్టించుకోడు. అక్కాయీ, తల్లీ దాని మనసునెపుడూ గాయపరుస్తుంటారు. ఎన్ని అవమానాలు చేసినా చుట్టుపక్కల వారు కూడా హేళన చేసినా ఇన్‌ఫీరియారిటీ ఫీలవదు. చాలామంది అనాకారుల్లా, అవిటివారులా, అదొకటి మెచ్చుకోవచ్చు. ఎవరయినా తనమీద జాలిపడితే అసలు సహించలేదు. పిచ్చిపిల్ల "జాలి పడాల్సిన స్థితిలో నేనేమీ లేను. తన పని తాను చేసుకోలేని వాళ్ళను, ఇతరులకు సాయపడలేని వారిని చూసి జాలిపడాలి. కానీ నేనా రెండు పనులూ చేయగలను" అంటుంది స్థిరంగా.

"అమ్మా! అన్నంపెట్టు" అంటూ రవి రావడంతో ఆలోచనల నుండి బయట పడింది శాంతి.

** ** **


మర్నాడు సుందరి చాలారోజుల తర్వాత ఏటిగట్టునున్న దేవాలయానికి వెళ్ళి వచ్చింది. ప్రసాదం తల్లికిస్తుంటే కసురుకుంటోంది. అదోలా విరునవ్వు నవ్వి తన గదిలో దూరి తలుపు వేసుకుంది. కిటికీలోనుండి బయటికి చూడసాగింది. వెన్నెల కాంతి కొంగువాలు నుండి తొంగి చూస్తున్నాడు రాకా శశి. కొంగువాలు నుండి బయటికి వస్తే అందమైన పొగడపూల దండలిస్తానని పొగడచెట్టు సువాసనలతో రాయబారాలు పంపుతోంది. ఆరోజే అనాథ శరణాలయం నుండి వచ్చిన అపాయింట్‌మెంట్ ఆర్డర్ గాలికి రెపరెప లాడుతోంది టేబిల్‌మీద. దానిమీద పేపర్‌వెయిట్ ఉంచి నిద్రలోకి జారింది.

** ** **

రాత్రి 2 గంటల సమయంలో కాబోలు ఉక్కగా అనిపించి లేచింది రాజేశ్వరి. పరికాలంలో ఉక్కేమిటనుకుంటూ గది బయటికొచ్చింది. వంటగది నుండి ఎర్రటి మంటలు నాలుకసాచి ఇల్లంతా ఆక్రమించబోతోంది. క్షణాల్లో వలనం తెచ్చుకుని "అమ్మో! పిల్లలు" అనుకుంటూ మేడమీది గదిలోకి పరుగు తీసింది. వాళ్ళతో క్షేమంగా బయట పడేసరికి మంటలు ఇల్లంతా వ్యాపించాయి. ఈలోగా చుట్టుపక్కల వారంతా మంటలార్పే పనిలోకి దిగారు.

"ఇంకా నయం! లేచి చూసుకోకపోతే పిల్లలు దక్కేవారు కాదు" శిరీష, గౌతమిల ఇద్దరినీ కౌగలించుకుని ఏడ్చింది రాజేశ్వరి. ఇంతలో కబురు తెలిసి శాంతి వచ్చింది. రాజేశ్వరిని ఓదార్చి సుందరి కోసం చుట్టూ చూసింది కనిపించక "సుందరేది వదినా?" అడిగింది.

ప్రక్కనే డైనమేట్ పేలినట్లయి ఉలిక్కిపడింది రాజేశ్వరి. పిల్లలకోసం మేడమీదికి పరిగెత్తిన తనకు, తన రూము తర్వాత రెండవరూములో ఉన్న సుందరి గుర్తురాలేదని, మూలగా కొట్టులా ఉన్న గదిలో వున్న సుందరిని అగ్ని కబళించేదాకా జరిగింది తెలియదనీ, తెలిసినా అవిటికాలువల్ల త్వరగా బయటకు రాలేదని గుర్తు రాలేదా తల్లికి. గుర్తు వచ్చేసరికి మొదటిసారిగా సుందరికోసం రెండు నీటిబిందువులు మిగిలాయి కళ్ళలో.




శాంతి కళ్ళముందు అసహాయంగా మంటలకు గింగిరాలాడుతూ మరణించే సుందరి మెదిలింది. వదినపై అసహ్యాన్ని దాచుకోలేక పోయింది శాంతి.

"ఛీ! నువ్వు తల్లివేనా? అందంగా ఉన్నారని వాళ్ళిద్దరినీ రక్షించుకుని నడవలేని బిడ్డను అగ్నికాహుతి చేశావు. తల్లిగాకాకపోయినా కనీసం సాటిమనిషిగా కూతురిని చూడలేని నువ్వూ ఒక మనిషివేనా? సుందరి కంటే నువ్వేరకంగా అందమైన దానివి? ఇహ సంతోషపడు. దాని వికారరూపం నీ కళ్ళకిహ కనిపించదు. నీ బిడ్డల అందానికి గర్వించు."

గబగబా వెళ్ళి మంటలార్పే వారితో వెతికించింది. కానీ ప్రయోజనం లేకపోయింది. ఆ గది పూర్తిగా కాలిపోయి మాడమసిగుల రోతున నేలలోకి కూరుకుపోవడమే కాకుండా విరిగిన దూలాలు కూడా కాలిపోతున్నాయి.

** ** **

పదిహేను రోజులు గడిచిపోయాయి.

రాజేశ్వరి ఇల్లు బాగు చేయించే పనులు చూస్తోంది. ఆమెలో వెనకటి ఉత్సాహం లేదు. ముఖంలో కళాకాంతులు తరిగాయి. అలంకరణ ధ్యాసలేదు. ఉండుండి ఏమిటో తనలో తనే గొణుక్కుంటుంది. మోకాలిమీద అరచేతిఆసరాతో ఒక ప్రక్కగా వంగి నడుస్తూ ప్రసాదం ఇచ్చి కసురుతుంటే చిత్రంగానవ్వి వెళ్తున్న సుందరి కళ్ళముందు మెదులుతుంది ప్రతిక్షణం. "ఇంకేం ఏడతావులే అమ్మా. ఇదే చివరిసారి" అని నవ్వింది అనుకుంటుంది కాసేపు. "సుందరికేం తక్కువ. దాని కళ్ళు బాగుంటాయి. 2 సార్లు చూసినవారు మూడోసారి చూడకుండా ఉండలేరు" అంటూ గొణుగుతుందో సారి.

ఆ మధ్యాహ్నం పోస్ట్‌మాన్ ఉత్తరం అందించి వెళ్ళాడు. సంతకం చూసి త్రుళ్ళిపడింది రాజేశ్వరి. గబగబా చదవసాగింది.

ప్రియాతి ప్రియమైన అమ్మా,

కడసారి పాదాభివందనములు. పాదాలు వెనక్కు తీసుకున్నావామ్మా నా అనాకారం అంటుతుందని? నిన్నింక బాధపెట్టను. 'అమ్మ' అనే మాట ఎంత అపురూపమైందో! అందమైందో! ఎంత తియ్యనైనది అమ్మ ప్రేమ! అమ్మ ప్రేమకు అర్థం నీ దగ్గరే చూశానమ్మా! అక్కలను ఎంతగా ప్రేమిస్తావో నాకు తెలుసు. ఎంత అదృష్టం చేసుకున్నారో వాళ్ళు. అమ్మా! ఒక్క మాట నీకిష్టమైనా కాకపోయినా చెప్పాలని ఉంది. మళ్ళీ జన్మంటూ ఉంటే నీ కడుపునే, అందమైన కూతురిగా పుట్టాలని ఉందమ్మా?! ఆ అదృష్టం కోసమే ఇక్కడ అనాథ పిల్లలకు సేవ చేయడానికి వచ్చాను. ఈ పిల్లలకు కళ్ళు కనిపించవు. వాళ్ళు నా వికారరూపం, అవిటి నడక చూడలేరు. నన్నెప్పటికీ అసహ్యించుకోరు వీళ్ళు. వీళ్ళకు చేయూతనిచ్చి నడిపించే కంటివెలుగును నేనమ్మా! నా జీవితం ఇక్కడ సుఖంగా, ప్రశాంతంగా, తృప్తిగా సాగుతుందన్న నమ్మకం నాకుంది. నా అవసరం మీకు ఉండదని భావించి నా అడ్రస్ వ్రాయడంలేదు. మళ్ళీ మళ్ళీ ఉత్తరం వ్రాసి నిన్ను బాధించనమ్మా. వచ్చే జన్మకయినా నా అదృష్టం పండాలని దీవించగలవా అమ్మా?!

నీ బిడ్డ కాలేకపోయిన

'సుందరి' *